# పెరటి కోళ్ళ పెంపకం


## డా॥ ఎన్. రాజన్న

ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి

కె.వి.కె. మమూనూర్

## డా॥ బాలకృష్ణన్

ప్రధాన శాస్త్రవేత్త

నార్మ్, హైదరాబాద్.

## డా॥ జె. శశాంక్

శాస్త్రవేత్త

కె.వి.కె. మమూనూర్

## డా॥ జె. సాయికిరణ్

శాస్త్రవేత్త

కె.వి.కె. మమూనూర్

# విషయసూచిక


| క్ర.సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| 1. | ఉపోద్ఘాంతం | 2 |
| 2. | పెరటికోళ్ళ పెంపకం వల్ల మారుమూల గ్రామీణ స్త్రీలకు కలిగే ప్రయోజనాలు | 2 |
| 3. | పెరటికోళ్ళనే ఎందుకు పెంచాలి | 3 |
| 4. | యాజమాన్యం - సూచనలు | 3 |
| 5. | కేవలం దేశీకోళ్ళనే పెంచుకుంటే లాభాలు రావు, ఎందుకంటే? | 4 |
| 6. | మనరాష్ట్రంలో లభించే మేలుజాతి పెరటి కోళ్ళు | 5 |
| 7. | నర్సరీలలో పెరటికోళ్ళ యాజమాన్యం | 12 |
| 8. | పెరటి ప్రదేశాలలో యాజమాన్యం | 19 |
| 9. | దేశవాళీ కోళ్ళ యొక్క పోషణ | 20 |
| 10. | గుడ్ల క్యాండిలింగ్ (పిండ పరీక్ష) | 23 |
| 11. | పెరటికోళ్ళలో సాధారణంగా వచ్చే వ్యాధులు వాటి నివారణ | 24 |
| 12. | మార్కెటింగ్ | 27 |
| 13. | పెరటికోళ్ళ పెంపకములో ఆదాయ వ్యయాల వివరాలు | 28 |

# పెరటి కోళ్ళ పెంపకం

భారతదేశంలో 2023-24 గాను కోడిగుడ్ల యొక్క ఉత్పత్తి 142.77 బిలియన్. మన దేశం ప్రపంచ దేశాల్లో కోడిగుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉంది. తలసరి కోడిగుడ్ల యొక్క వినియోగం సంవత్సరానికి 103. మొత్తం కోడిగుడ్ల ఉత్పత్తి కమర్షియల్ ఫార్మ్ లో నుండి 114.92 బిలియన్ ఉండగా పెరటి కోళ్ల నుండి 2.7 బిలియన్ ఉంది. మాంసం ఉత్పత్తిలో భారతదేశం 5వ స్థానంలో ఉంది. పౌల్ట్రీ నుండి ఉత్పత్తి అయ్యే మాంసం 4.99 టన్నులు కాగా ఇది మొత్తం మాంసం ఉత్పత్తిలో 48.96% శాతం. మన దేశంలో కోళ్ళ పరిశ్రమ అభివృద్ధి చెందినప్పటికి, గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజానీకానికి కోడిగ్రుడ్లు మరియు మాంసము అందుబాటులో లేదు. గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు సమతుల్యమైన ఆహారం ఇవ్వాలంటే వారికి చౌకగా దొరికే కోడిగ్రుడ్లు మరియు కోడి మాంసము తప్పక అందుబాటులోకి రావాలి. పెరటిలో కోళ్ళ పెంపకం ఇంటిల్లిపాదికి సమతుల్యమైన ఆహారం అందివ్వడంతోపాటు అదనపు ఆదాయము ఇవ్వగలదు. కావున ఇటీవల కాలంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పెరటిలో కోళ్ళ పెంపకానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి.

గ్రామాలే మనదేశానికి పట్టుకొమ్మలు గ్రామాలు అభివృద్ధి చెందితే మనదేశం సుసంపన్నం అవుతుంది. అభివృద్ధి చెందాలంటే ఉపాధి కావాలి. ముఖ్యంగా మన గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి దొరకడం చాలా కష్టంగా మారింది. విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడిన తరువాత పట్టణాలు ప్రాంత మహిళలు కొంతవరకు లబ్ధి చెందుతున్నా, గ్రామీణ మహిళలు మాత్రం ఈ అవకాశాలను అందిపుచ్చుకోవటంలో ఇంకా వెనుకంజలో ఉన్నారు. ఒకప్పుడు గ్రామీణ మహిళల ఉపాధి కుట్లు, అల్లికలు వీరికోసం ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా. సద్వినియోగం చేసుకునేది కొందరే. ఏది చేద్దామన్నా పెట్టుబడి కావాలి. పెట్టుబడి పెట్టే స్థోమత వీరికి లేదు. దీనికి తోడు నిరక్షరాస్యత, అంతేగాక గ్రామీణ మహిళలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంత మహిళలు కోళ్ళు పెంచడం సాంప్రదాయం. ప్రతి ఇంటికి 10-15 కోళ్ళు ఉండేవి. వీటి ఆలనా పాలనా మహిళలే చూసేవారు. వీరికి కావలసిన మాంసం గాని, గ్రుడ్లు గాని ఇవి ఇచ్చేవి. ఎప్పుడయితే బ్రాయిలర్ కోళ్ళు వచ్చాయో, వీటి పెంపకం మరుగున పడింది. కానీ దేశీకోడి రుచితో, వాసనతో బ్రాయిలర్ కోడి వెనుకంజలోనే ఉంది. దేశీకోడి మాంసం దొరకడం కష్టం అయిపోయింది. ఈ మధ్యకాలంలో దేశీకోళ్ళ పెంపకం ప్రాముఖ్యత చోటు చేసుకుంది.

అందుకే, గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలనిచ్చే ఉపాధి - మేలుజాతి దేశీకోళ్ళ పెంపకం. ముఖ్యంగా వెనకబడిన వర్గాల ప్రజలు, చిన్నకారు రైతులకు ఒక అదనపు ఆదాయ వనరుగా తోడ్పడుతుంది. ఈ కోళ్ళను పెంచడానికి ప్రత్యేక సమయం కేటాయించాల్సిన అవసరం లేదు. ప్రత్యేకంగా దాణా ఇవ్వాల్సిన అవసరం లేదు. వీటిని మనపెరట్లో ఆరుబయట వీటిని పెంచుకోవచ్చు. ఇవి మన ఇంటి చుట్టుప్రక్కల దొరికే ధాన్యం గింజలు, ఆకులు, పురుగులు, కీటకాలు, వంటగది వ్యర్థాలను తిని బ్రతుకుతాయి. వీటికి ఎక్కువ స్థలం కూడా కేటాయించాల్సిన అవసరం లేదు. రాత్రి సమయాల్లో రక్షణ కల్పిస్తే చాలు. పెద్దగా రోగాలు కూడా రావు. మన పనులు చూసుకుంటూనే దీనిని ఒక అనుబంధ ప్రక్రియగా మార్చుకుంటే ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు.

# 1.ఉపోద్ఘాతం

జీవనోపాధికి చాలా మార్గాలు, ఉన్నా, గ్రామీణ ప్రాంతాలలో ఉండే అట్టడుగు వర్గాల వారికి, నిరక్షరాస్యులకి అవి అన్ని అందుబాటులో ఉండవు మరియు ఇలాంటి వారికి ఉపాధి కల్పించడం కూడ కొంత సమస్యతో కూడుకున్న విషయం. అటువంటి వారికి పరిష్కారానికి చూపించే శాఖలలో పశుసంవర్ధక శాఖ ముందుంటుంది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలయిన పాడిపరిశ్రమ, గొర్రెల, మేకల పెంపకం గ్రామీణులకు జీవనోపాధిని కలిగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. కాని వీటికి ఆర్థికంగా పెట్టుబడి, విషయ పరిజ్ఞానము, ఓపికా కావాలి. తక్కువ పెట్టుబడితో, శ్రమలేకుండా, ఎటువంటి సమయం కేటాయించకుండా, ఎవరి పనులు వారు చేసుకుంటూ పైవాటికి అనుబంధంగా, ఎవరైనా ఎంచుకోదగ్గ తేలికైన ఉపాధి మార్గమే పెరటి కోళ్ళ పెంపకం.

ఈ పెరటి కోళ్ళ పెంపకం ద్వారా వచ్చే అనుబంధ ఆదాయం ఇంటి కనీస అవసరాలను తీర్చుతుంది. పండుగలప్పుడు, వేడుకలప్పుడు రుచికరమైన, శ్రేష్టమైన మాంసం, గ్రుడ్లు ఇంట్లోనే అందుబాటులో ఉంటాయి. కోడిగ్రుడ్డు అన్ని వయస్సులవారికి పిల్లలకు, పెద్దలకు, గర్భిణీ స్త్రీలకు పిల్లల తల్లులకు మంచి పౌష్టికాహారం కాబట్టి దీనిని తీసుకోవడం ద్వారా అందరు ఆరోగ్యంగా ఉంటారు. అత్యవసర పరిస్థితులలో గుడ్లను, కొన్ని కోళ్ళను అమ్ముట ద్వారా ఆదాయమును పొందవచ్చును. ఇలా గ్రామీణ పేదలకు, బడుగు బలహీన వర్గాల వారికి ఈ పెరటికోళ్ళ పెంపకం ఇంటిల్లిపాదికి బలవర్ధకమైన ఆహారాన్ని అందివ్వడంతోపాటు, ఆరోగ్యాన్ని ఇస్తుంది అని అనటంలో ఏమాత్రము సందేహం లేదు.

సాంప్రదాయబద్దంగా తరతరాల నుండి పెంచుకునే నాటుకోళ్ళ సంగతి మనకు తెలిసిందే ఇప్పటికీ వాటి మాంసానికి, గ్రుడ్లకు ఉన్న గిరాకీ ఇంతాఅంతా కాదు. కాని నాటుకోళ్ళ పెరుగుదలలో జాప్యం, వాటి మాంసం మరియు గ్రుడ్ల దిగుబడి తక్కువగా ఉండటంచేత ఆదాయం ఆశించినంతగా రాదు. దీనిని గ్రహించిన శాస్త్రవేత్తలు ఈ నాటుకోళ్ళ స్థానంలో, నాటుకోళ్ళను పోలిన అభివృద్ధి పరిచిన కోళ్ళను కనుగొనడం జరిగినది. వీటి పెంపకం వలన తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పొందవచ్చును.

# 2. పెరటికోళ్ళ పెంపకం వల్ల మారుమూల గ్రామీణ స్త్రీలకు కలిగే ప్రయోజనాలు

మనదేశంలో ప్రస్తుతం కోళ్ళ పరిశ్రమ ప్రధానంగా పట్టణ,నగర పరిసరాలకే పరిమితమై ఉంది. అందువలన గ్రుడ్లు, మాంసం కూడా పట్టణ మరియు నగర ప్రాంతాలలో అతి తక్కువ ధరలకు సులభంగా దొరుకుతున్నాయి. అదే గ్రామీణ ప్రాంతాలలో ఇవి అందుబాటులో లేవు. కనుక దీనిని అధిగమించాలంటే గ్రామాలలో పెరటికోళ్ళ పెంపకంను ప్రోత్సహించడం చాలా ముఖ్యమైనది. కోళ్ళ పెంపకం అనగానే చాలా మంది కోళ్ళ పెంపకమా? ఎందుకొచ్చిన తిప్పలులే, అందులో వచ్చేది లేదు, చచ్చేది లేదు అంటు పెదవి విరుస్తారు. కాని ఏంచేస్తే సరియైన లాభం వస్తుందో తెలుసుకొని అభివృద్ధి పరిచిన కోళ్ళను సరియైన యాజమాన్య పద్ధతులలో పెంచుకుంటే మంచి లాభాలు తప్పక వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది వ్యర్థపదార్థాలను మేసి, తద్వారా విలువైన పోషకాహారాన్ని ఉత్పత్తి చేసి ప్రక్రియ మరియు గ్రామీణ నిరుపేదలకు చౌకగా పోషకాహారాన్ని అందించే సువర్ణ అవకాశం.

## 3. పెరటి కోళ్ళనే ఎందుకు పెంచుకోవాలి

1. వీటి మాంసం, గ్రుడ్లను కుల, మతాలకు అతీతంగా తింటారు.
2. మార్కెట్లో కోడిమాంసము మిగతా మాంసాలకన్నా తక్కువ ధరకు దొరుకుతుంది.
3. అదనపు ఆదాయ వనరుగా ఉంటుంది.
4. గ్రామాలలో ఎక్కువ మందికి ఆదాయాన్ని ఇస్తుంది.
5. పోషకాహారాన్ని ఇస్తుంది.
6. జీవన విధానాన్ని మెరుగుపరుస్తుంది.
7. పెట్టుబడి చాలా తక్కువ, శ్రద్ధ, శ్రమ కూడా తక్కువ.
8. తక్కువకాలంలో ఎక్కువ ఆదాయం వస్తుంది.
9. ఎవరైనా కోళ్ళను పెంచుకోవచ్చును.
10. ఇతర పనులు చేసుకుంటూ, దీనిని చేపట్టవచ్చును.
11. ఇవి నాటుకోళ్ళను పోలి ఉంటాయి. కాబట్టి చాలా ఇష్టంగా తింటారు.
12. ఇవి ముచ్చటైన రంగుల్లో ఉండి అందరిని ఆకర్షిస్తాయి.
13. మహిళలు అన్నిటికి భర్త సంపాదనపైన ఆధారపడాల్సిన అవసరము లేదు.
14. కొవ్వు తక్కువగా ఉంటుంది.
15. బాగా రుచిగా ఉంటుంది.

## 4. యాజమాన్యం - సూచనలు :

- 6 వారాల వయస్సు వరకు ఈ కోడి పిల్లలు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకోలేవు. కనుక వీటికి తగిన వేడి ఇవ్వవలసి ఉంటుంది. పిల్లలను ఆరు వారాల వయస్సు వరకు షెడ్లలో పెంచి తదుపరి బయట విడిచి పెట్టవచ్చును.

- ఒకరోజు వయస్సు ఉన్నప్పుడు మగకోడి పిల్లలను వేరు చేసిన తరువాత వీటిని వేరుగా పెంచి మార్కెట్టులో మాంసం కొరకు అమ్మవచ్చును.

- ప్రారంభపు వయస్సులో వీటిని అనుకూలమైన వాతావరణంలో పెంచుతూ సాయంకాల విశ్రాంతి కొరకు గూళ్ళను తిరిగి వచ్చేలాగా వీటికిక అలవాటు చేయాలి.

- రాత్రి విశ్రాంతి గూటిలో తగినంత గాలి, వెలుతురు వచ్చే విధంగా చూసుకోవాలి.

- క్రమం తప్పకుండా లోపల ఉండే కోడి పెంటను తొలగించి శుభ్రపరుస్తుండాలి.

- కుక్కలు, పిల్లులు మొదలగు వాటి నుండి రక్షణ కల్పించే విధంగా వీటి గూళ్ళను నిర్మించుకోవాలి.

- తగినంత పరిశుభ్రమైన నీళ్ళను అందించాలి.

- గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సంచరించే కారణంగా ఇవి పరాన్న జీవుల (నట్టలు) బారినపడే అవకాశాలుంటాయి. అందుకొరకు ప్రతి 3-4 నెలల కాల వ్యవధిలో ఒకసారి మందుల ద్వారా వీటి కడుపులో ఉండేటువంటి పురుగులను నిర్మూలించాలి. దీనికొరకై పైపరేజిన్ అనే మందును ఒక చెంచాడు తీసుకొని అర లీటరు నీటిలో కలిపి ఒక్కొక్క కోడికి 5-10 మి.లీ. తాగించాలి.

- ఇక్కడి వాతావరణంలో పెడిగేటప్పుడు వీటికి ఇచ్చే దాణా ఆయా ప్రాంతాల్లో లభించే ఇతర దాణా వనరులపైనే ఆధారపడి ఉంటుంది.

- ఒక్కరోజు కోడి పిల్లలను తెచ్చుకొన్నట్లయితే వాటి విషయంలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులేవనగా, వచ్చినరోజే వీటిని బ్రూడర్ క్రింద ఉంచవలయును.

## 5. కేవలం దేశీకోళ్ళనే పెంచుకుంటే లాభాలు రావు, ఎందుకంటే?

మన దేశీ / ఊరు కోళ్లు 1.2 లేదా 1.5 కేజీల కంటే ఎక్కువ పెరగవు. ఇది జన్యు సంబంధ అవరోధం. ఇక పెట్టల విషయానికి వస్తే 7-8 నెలల తర్వాత గ్రుడ్లు పెడతాయి. పైగా ఇవి చిన్నగా, ఒక్కోటి 40 గ్రా॥ బరువు మాత్రమే ఉంటుంది. వీటి గ్రుడ్లు పెట్టే సామర్థ్యం కూడా తక్కువ, మహాఅయితే సంవత్సరానికి 40 గ్రుడ్లు పెడతాయి. తక్కువ మాంసం, తక్కువ గ్రుడ్లు పెట్టడం వలన ఆశించినంత పెద్దగా లాభాలు రావు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కువ గ్రుడ్లు పెట్టే, తక్కువ వయసులో ఎక్కువ మాంసాన్నిచ్చే మేలుజాతి పెరటి కోళ్ళను మనదేశ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ కోవకు చెందినవే రాజశ్రీ, వనరాజ, గిరిరాజ, గ్రామప్రియ కోళ్ళు, వీటిని మనదేశీకోళ్ళు మరియు మేలుజాతి కోళ్ళ సంకరణంతో అభివృద్ధి చేశారు. ఈ కోళ్ళు కూడా (పట్టిక 1) మన దేశీకోళ్ళలాగే రంగులోగాని, రోగ నిరోధక శక్తిలోగాని, శత్రు జంతువుల నుండి తప్పించుకోవడంలోగానీ ఏ మాత్రం తీసిపోవు. మంచి యాజమాన్య పద్ధతు పాటించినట్లయితే ఇవి సంవత్సరానికి 120 గ్రుడ్ల వరకు పెడతాయి. 9-10 వారాల వయస్సులో 1.5 - 2 కేజీల బరువు వస్తాయి. అంతేగాక, ఇవి పెరట్లో దొరికే క్రిమికీటకాలు, రాలిపోయిన ధాన్యం గింజలు, వంటగది వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకుంటాయి. కావున మన పెరట్లో ఇలాంటి మేలుజాతి కోళ్ళ (పట్టిక - 1) పెంపకంతో మన అవసరాలను

తీర్చుకోవడంతోపాటు, అదనంగా ఆదాయం సంపాదించవచ్చు. అవసరాన్ని బట్టి అనుకూలతను బట్టి 10-20 కోళ్ళు ఒక్కో ఇంటి చొప్పున గ్రుడ్లకోసం గాని, మాంసంకోసం గాని పెంచుకోవచ్చు. మాంసం కోసం అయితే ఎక్కువ సంఖ్యలో షెడ్డులో కూడా పెంచుకోవచ్చు. పైగా వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

## 6. మనరాష్ట్రంలో లభించే మేలుజాతి పెరటి కోళ్ళు

**పట్టిక - 1 మనరాష్ట్రంలో లభించే మేలుజాతి పెరటి కోళ్ళు**

| | | |
|---|---|---|
| రాజశ్రీ | గ్రుడ్లు మరియు మాంసం | పశువైద్య కళాశాల, కోళ్ళశాస్త్ర విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్, 040-24015316 |
| వనరాజు | గ్రుడ్లు మరియు మాంసం | డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రీసెర్చ్, రాజేంద్రనగర్, 5-500 030, 040-2401780, 040-24015651, 040-24019667 |
| గ్రామప్రియ | గ్రుడ్ల రకం | |
| కృషిబ్రో | మాంసం రకం | |
| శ్రీ నిధి | గ్రుడ్లు మరియు మాంసం | |

### 6.1. సిరులు కురిపించే పెరటికోడి "రాజశ్రీ"



ఈ జాతి కోళ్ళను పి.వి. నర్సింహరావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వారు రూపొందించారు.

- ఇది నాటుకోడిని పోలి ఉంటుంది. ముదురు ఎరుపు రంగులో, పొడవయిన కాళ్లతో బలిష్టంగా ఉంటుంది.

- రాజశ్రీ కోడి శరీర పరిమాణం మధ్యస్థంగా ఉండి మాంసం మరియు గ్రుడ్ల ఉత్పత్తికి అనువుగా ఉంటుంది.
- ఇది మనదేశ వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా రూపొందించారు.
- నాటుకోళ్ళ రక్తం కూడా 25 శాతం ఉన్నందున వ్యాధి నిరోధక శక్తి మరియు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే శక్తి ఎక్కువ.
- పొడవైన, బలమైన కాళ్ళు ఉండి, చురుకుగా కదులుతూ పిల్లులు, కుక్కల నుండి సులువుగా తప్పించుకోగలవు.
- ఇవి ఇరవై వారాల వయస్సులో పెట్ట 1.5 కిలోలు, పుంజు 1.75 కిలోల బరువు వస్తాయి.
- 160 రోజుల వయస్సు నుండి గ్రుడ్లు పెట్టడం మొదలు పెడతాయి. ఏడాదికి 150-160 గ్రుడ్లు పెడతాయి. గ్రుడ్డు బరువు 50-55 గ్రాములు.

## రాజశ్రీ కోళ్ళ ఉత్పత్తి సామర్థ్యం క్రింది పట్టికలో పొందుపరచబడినది.

| | |
|---|---|
| 8 వారాల వయస్సులో కోడి పిల్ల బరువు | 500 గ్రాములు (పెట్టపిల్ల)<br>550 గ్రాములు (పుంజు పిల్ల) |
| 16 వారాల వయస్సులో కోడి బరువు | 1300 గ్రాములు (పెట్ట)<br>1500 గ్రాములు (పుంజు) |
| 20 వారాల వయస్సులో కోడి బరువు | 1500 గ్రాములు (పెట్ట)<br>1750 గ్రాములు (పుంజు) |
| మొదటి గుడ్డు పెట్టే వయస్సు | 24 వారాలు |
| ఒక సంవత్సరంలో గుడ్ల ఉత్పత్తి | 160-170 గుడ్లు |
| గుడ్డు బరువు | 55 గ్రాములు |

రాజశ్రీ కోడిపిల్లలను 6-8 వారాల వరకు షెడ్డులో శాస్త్రీయ పద్ధతిలో పెంచాలి. ఇదే కాలంలో వీటికి ఇవ్వవలసిన అన్ని టీకాలను ఇప్పించాలి. రైతు సోదరులు రాజశ్రీ కోళ్ళను పెంచుకోవాలంటే, కావల్సినన్ని 6-8 వారాల పిల్లలను ప్రభుత్వ సంస్థల ద్వారా లేదా నమ్మకమైన వ్యక్తుల నుండి కొని పెంచుకోవచ్చు. ఈ విధంగా కోడి పిల్లలను పెంచి రైతులకు అమ్మడం ఒక ఉపాధి అవకాశంగా కేంద్ర & రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి.

## 6.2 ఘాగస్ కోళ్ళు

ఘాగస్ కోళ్ళని ఐసిఎఆర్ - కోళ్ళ పరిశోధనా సంస్థ రాజేంద్రనగర్, హైదరాబాద్ వారు రూపొందించారు.

### ఘాగస్ పెంపకం యొక్క ప్రధాన ప్రయోజనం

ఇవి స్వచ్ఛమైన స్థానిక కోళ్ళు. అంటే రైతు ఘాగస్ యొక్క ఫలదీకరణము చెందిన గ్రుడ్లను ఉపయోగించి సహజమైన పొదుగుదల ద్వారా తరువాత తరం కోడిపిల్లలను ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ స్థానిక కోళ్ళ యొక్క తాజా బ్యాచ్ కోడిపిల్లలను సేకరించడానికి వారు మళ్లీ మళ్లీ హేచరీకి రావాల్సిన అవసరం లేదు. ఘాగస్ కోళ్ళు అధిక పొదుగు సామర్థ్యం (బ్రూడినేస్) కలిగి వుంది మరియు అవి స్వయంగా వృద్ధి చెందగలవు. అంటే ఈ జాతి కోళ్ళు సహజమైన పొదుగుదల ద్వారా తమ సంతానం (కోడిపిల్లలను) సొంతంగా పొదిగి ఉత్పత్తి చేయగలవు.

### ఘాగస్ జాతి కోళ్ళ ప్రధాన లక్షణాలు

- ఆకర్షణీయమైన రంగు ఈకలు.
- మధ్యస్థమైన శరీర బరువు.
- ధృఢమైనవి మరియు ఒత్తిడి తట్టుకోగల సామర్థ్యం.
- పొడవాటి కాళ్ళు.
- ముదురు గోధుమ రంగు గ్రుడ్లను ఉత్పత్తి చేస్తుంది.
- ఘాగస్ కోళ్లు పొదిగే స్వభావం వల్ల ఇవి స్వయంగా పిల్లలను ఉత్పత్తి చేయగలవు.
- తక్కువ కొవ్వు మాంసం కలిగి ఉంటాయి.

### పట్టిక 1. ఘాగస్ కోళ్ల పనితీరు

| లక్షణం | ఫార్మ్ లో | ఫీల్డ్ లో |
|---|---|---|
| శరీర బరువు | | |
| 8 వారాలు, గ్రా | 400-450 | - |
| 20 వారాలు, కేజీ | 1.8 - 2.0 (మగ ) - 1.2 - 1.4(ఆడ ) | - |
| 40 వారాలు, కేజీ | 2.6 - 2.8 (మగ ) | 2.0 - 2.1 (మగ) |
| | 1.4 - 1.6 (ఆడ ) | 1.2 - 1.4 (ఆడ ) |

| | | |
|---|---|---|
| మొదటి గ్రుడ్డు పెట్టే వయస్సు, రోజులు | 170-180 | 175-200 |
| గ్రుడ్ల ఉత్పత్తి 72 వారాల వరకు సంఖ్య | 110-115 | 60-80 |
| గ్రుడ్ల బరువు, గ్రా | | |
| 40 వారాలు | 42-46 | 40-42 |
| 72 వారాలు | 46-48 | - |
| మాంసం దిగుబడి&, % (డ్రెస్సింగ్ పర్సెంటేజ్) | 98-70 | - |
| పిల్లలు పొదిగే సామర్థ్యం, % | 85-92 | - |
| హ్యచబిలిటీ (ఫలదీకరణము చెందిన గ్రుడ్లు) % | 90.80 | - |
| 20 వారాల వరకు బ్రతికే సామర్థ్యం % | 85-90 | - |
| 21-40 వారాల వరకు బ్రతికే సామర్థ్య % | 90-95 | - |



## 6.3 శ్రీనిధి కోళ్ళు

శ్రీనిధి కోళ్ళని ఐసిఎఆర్ - కోళ్ళపరిశోధనా సంస్థ రాజేంద్రనగర్, హైదరాబాద్ వారు రూపొందించారు

**పట్టిక : శ్రీనిధి కోళ్ళ ఉత్పత్తి సామర్థ్యం**

| వివరాలు | ఉత్పత్తి |
|---|---|
| శరీర బరువు (గ్రా) | |
| 6 వారాలు | 600-500 |
| 20 వారాలు | 1700-2000 |
| గ్రుడ్లు బరవు (గ్రా) | |
| 28 వారాలు | 48-50 |
| 40 వారాలు | 52-55 |
| మొదటి గ్రుడ్డు వయస్సు, రోజులు | 165-170 |
| సంవత్సర కాలంలో గ్రుడ్ల ఉత్పత్తి | 140-150 |
| బ్రతికే సామర్థ్యం (6 వారాలు) | 95 |

**ఈ శ్రీనిధి కోళ్ళ ముఖ్య లక్షణాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.**

- విభిన్న రంగులలో ఆకర్షణ కలిగిన ఈకలు
- త్వరగా పరిగెట్టుటకు వీలుగా ఉండే పొడవైన కాళ్లు,
- అధిక రోగనిరోధక శక్తిని కలిగి ఉండటం
- దేశవాళీ కోళ్ళ కంటే ఎక్కువ గ్రుడ్ల ఉత్పత్తి మరియు బరువు పెరగటం
- గోధుమ రంగులో గల గ్రుడ్లను అధిక మోతాదులో ఉత్పతి.



## 6.4 వనశ్రీ కోళ్ళు

వనశ్రీ మెరుగైన, స్వచ్ఛమైన జాతికోళ్ళు. కాబట్టి ఇవి త్వరగా పెరుగుతాయి మరియు ఎక్కువ సంఖ్యలో గ్రుడ్లను ఉత్పత్తిచేస్తాయి. రైతులు వనశ్రీ యొక్కపొదిగే గ్రుడ్లనుఉపయోగించి క్రొత్తబ్యాచ్ కోడిపిల్లలను ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో కోడిపిల్లల క్రొత్త బ్యాచును సేకరించడానికి హేచరీకి రావాల్సిన అవసరంలేదు. వనశ్రీ యొక్క కొన్ని కోళ్ళుపొదిగే స్వభావంకూడా కలిగి ఉంటాయి మరియు సహజమైన పొదిగే లక్షణం వల్ల క్రొత్త బ్యాచ్ పిల్లలను పొందే అవకాశం ఉంటుంది.

### వనశ్రీ యొక్క ముఖ్యమైన లక్షణాలు

- ఆకర్షణీయమైన బంగారు పసుపు రంగు ఈకలు.
- డవైన కాళ్ళు, వేగంగా పరుగెత్తే సామర్ధ్యం.
- అధిక శరీర బరువు కలిగి ఉంటాయి.
- ఎక్కువ సంఖ్యలో గ్రుడ్లు ఉత్పత్తి చేస్తాయి.
- లేత గోధుమ రంగు గుడ్లను ఉత్పత్తిచేస్తాయి.
- తక్కువ కొవ్వుపదార్థంకలిగిన మాంసాన్ని ఉత్పత్తిచేస్తాయి.
- బ్రతికే సామర్ధ్యంఅధికంగా కలిగి ఉంటాయి.
- మగ పక్షులలో దూకుడు సామర్ధ్యం అధికం.

### వనశ్రీ కోళ్ళ పనితీరు

| లక్షణం | ఫార్మ్ లో | ఫీల్డ్ లో |
|---|---|---|
| శరీర బరువు | | |
| 8 వారాలు | 500 - 570 గ్రా. | - |
| 20 వారాలు | 1.8 - 2.2 కేజీ (మగ) | 1.2 - 1.3 కేజీ (మగ) |
| | 1.4 - 1.6 కేజీ (ఆడ) | 1.0 - 1.1 కేజీ (ఆడ) |
| 40 వారాలు | 2.8 - 3.0 కేజీ (మగ) | 2.1 - 2.5 కేజీ (మగ) |
| | 1.4 - 1.6 కేజీ (ఆడ) | 1.4 - 1.8 కేజీ (ఆడ) |
| మొదటి గ్రుడ్డు వయస్సు, రోజులు | 160 - 180 రోజులు | 185 - 200 రోజులు |

| | | |
|---|---|---|
| గ్రుడ్ల ఉత్పత్తి 72 వారాల వరకు | 180 - 192 | 100 - 120 |
| **గ్రుడ్ల బరువు, గ్రా** | | |
| 40 వారాలు | 46 - 49 గ్రా. | 42 - 45 గ్రా. |
| 72 వారాలు | 48 - 50 గ్రా. | - |
| మాంసం దిగుబడి, 20 వారాలు | 68 - 70% | - |
| పిల్లలు పొదిగే సామర్థ్యం, % | 80.5 - 84.5% | - |
| హ్యాచబిలిటీ (ఫలదీకరణము చెందిన గ్రుడ్లు), % | 82 - 86% | - |
| 8 వారాల వరకు బ్రతికే సామర్ధ్యం, % | 94 - 95% | - |
| 20 వారాల వరకు బ్రతికే సామర్ధ్యం, % | 85 - 92% | - |
| 21-40 వారాల వరకు బ్రతికే సామర్ధ్యం, % | 90 - 95% | - |



## 6.5 కృషిబ్రో కోళ్ళు

కృషిబ్రో కోళ్ళని ఐసిఎఆర్ - కోళ్ళపరిశోధనా సంస్థ రాజేంద్రనగర్, హైదరాబాద్ వారు రూపొందించారు

### పట్టిక-1 కృషిబ్రో కోళ్ళ ముఖ్య లక్షణాలు

| | | |
|---|---|---|
| శరీర బరువు (గ్రా) | ఒక రోజులో బరువు | 40 |
| | ఆరు వారలో | 1500 |
| | ఏడు వారలో | 1800 |
| మరణాలు | ఆరు వారలో | 3% కంటే తక్కువ |
| | ఏడు వారలో | 3% |

| | | |
|---|---|---|
| డ్రెస్సింగ్ శాతం | ఆరు వారలో | 71 |
| | ఏడు వారలో | 72 |
| దాణా పరివర్తన నిష్పత్తి దాణా వినియోగం | ఆరు వారలో | 2.1 |
| | ఏడు వారలో | 2.2 |

**కృషి-బ్రో యొక్క ఆకర్షణీయమైన లక్షణాలు:**

- తగిన బరువు
- విభిన్న రంగుల ఈకలు
- ఎక్కువ కాలం బ్రతక గలిగే సామర్థ్యం
- ధాణాపై తక్కువ ఖర్చు
- సమశీతోష్ణ మరియు ప్రతికూల పరిస్థితుల్లోను పెంచుకోవడానికి అనువుగా వుంటాయి.



## 7. నర్సరీలలో పెరటికోళ్ళ యాజమాన్యం

**లాభాలను ప్రభావితం చేసే అంశాలు :**

1. కోడిపిల్లల నాణ్యత (జన్యురీత్యా, ఆరోగ్యరీత్యా)
2. దాణా నాణ్యత
3. తగినంత స్థలంలో పెంచి తగినన్ని పరికరాలు అమర్చడం
4. నిర్వహణా విధానాలు, వాతావరణ పరిస్థితులు
5. దాణా వినిమయ సామర్థ్యం
6. షెడ్డు పారిశుద్ధ్యం, వ్యాధుల నివారణ

కోడిపిల్లలను మొదటి 8 వారాల వయస్సు వరకు నర్సరీలలో పెంచుతారు. ఈ సమయంలో వీటికి కావల్సినంత వేడిమిని (బ్రూడింగ్) అందిస్తారు. అంతేగాక సంపూర్ణ పోషక పదార్థాలు గల దాణా మరియు వ్యాధి నిరోధక టీకా ఇస్తారు (పట్టిక-2). బ్రాయిలర్ కోళ్ళను పెంచినట్టు వీటిని వరిపొట్టు పరిచిన నేలపై (డీప్ లిట్టర్ పద్ధతి) పెంచుతారు. వరిపొట్టు 2-3 అంగుళాల మందం పరిచి, దానిపై పేపరు పరచాలి. మొదటి వారం ఈ పేపరుపైనే దాణాను చల్లాలి. రెండవ వారం నుండి దాణా మరియు నీటి తొట్టెలు అమర్చాలి. ఒక్కో కోడి పిల్లకు 2 వాట్ల బల్బులు అమర్చాలి. అంటే 100 పిల్లలకు 200 వోల్టుల బల్బు సరిపోతుంది. బ్రూడర్ క్రింద 37 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండేలా చూచుకోవాలి. చలికాలంలో కాస్త జాగ్రత్త ఉంటే మంచిది. ఎల్లవేళలా మంచినీరు అందించాలి. బ్రూడర్ క్రింద కోడిపిల్లల కదలికలను బట్టి, బ్రూడర్ బల్బుల సంఖ్య మరియు ఎత్తును మారుస్తూ ఉండాలి. ఒకవేళ కోడిపిల్లలు బ్రూడర్కి దగ్గర గుంపులుగా ఉంటే బల్బుల సంఖ్య పెంచాలి. బ్రూడర్ ప్రదేశం అంతటా కోడి పిల్లలు సమానంగా కదులుతూ ఉన్నాయంటే, అవి సౌకర్యంగా ఉన్నాయని అర్థం.

## 7.1 స్థలం ఎంపిక :

పెంపక పద్ధతుల్లో అన్నింటికన్నా ఉత్తమమైనది "ఆల్ ఇన్ ఆల్ ఔట్" పద్ధతి. ఈ పద్ధతిలో కోడి పిల్లలు అన్నీ ఒకసారి రావడం, అన్నీ ఒకేసారి అమ్మకానికి తయారవ్వడం జరుగుతుంది. అంటే ఫాంలో ఎల్లప్పుడు ఒకే వయస్సు కోళ్ళుంటాయి. ఈ విధంగా కోళ్ళను తీసివేసిన వెంటనే ఫాం ఖాళీ అయిపోతుంది. ఈ విధంగా కొంతకాలం ఖాళీగా ఉండడం వల్ల షెడ్లోను, ఫాంలోను ఏవైనా వ్యాధికారక క్రిములు ఆ పిల్లలను ఆశించడానికి వీలుండదు తద్వారా పిల్లలు మంచి ఆరోగ్యంతో ఎదుగుతాయి. తక్కువ స్థలంలో ఎక్కువ బ్రాయిలర్లు ఆశించడానికి వీలుండదు తద్వారా పిల్లలు మంచి ఆరోగ్యంతో ఎదుగుతాయి. తక్కువ స్థలంలో ఎక్కువ బ్రాయిలర్లు పెంచినట్లయితే కోళ్ళ ఎదుగుదల, దాణా వినిమయ సామర్థ్యం బరువు మొదలగునవి క్షీణించడమేగాక, పొడుచుకోవడం, మరణాల సంఖ్య హెచ్చడం వంటివి సంభవించవచ్చు. ఈ విధంగా పెంచిన కోళ్ళకు మార్కెట్లో కూడా గిరాకి తక్కువగా ఉంటుంది. మీరు కోళ్ళను 6 వారాల వయసు వరకు పెంచదలచినట్టయితే కోడి ఒక్కొంటికి 1 చదరపు అడుగు చొప్పున స్థలాన్ని కేటాయించాలి. ఒకవేళ షెడ్డు చాలా పెద్దదిగా ఉన్నట్లయితే దాన్ని గదుల (పెన్) క్రింద విభజించవచ్చు.

## 7.2 కోడి పిల్లల ఎంపిక :

కొనుగోలు చేసే కోడిపిల్లల ఎంపిక అనేది లాభనష్టాలను ఎంతో ప్రభావితం చేస్తుంది. మాంసం

కోళ్ళు జన్యురీత్యా త్వరితంగా ఎదుగగలిగే సామర్థ్యాన్ని కల్గి ఉండాలి. లేని యెడల శ్రమ, సమయం, దనం అన్నా వృధా అయ్యే ప్రమాదం ఉంది పుల్లోరం - ఫౌ ఫాయిడ్ వంటి వ్యాధులు లేని కోళ్ళ నుండి పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీల నుండి కోడి పిల్లలను కొనుగోలు చేయాలి.

## 7.3 షెడ్డు నిర్మాణం :

వీలైనంత వరకు షెడ్లు విశాల ప్రాంతంలో, గాలి వీచే ప్రాంతంలో నిర్మించాలి. లోతట్టు ప్రాంతాలలోను, చెమ్మగా ఉండే ప్రాంతాలలోను, లోయవంటి ప్రాంతాలలోను షెడ్ల నిర్మాణం చేపట్టరాదు. నేల చదునుగా లేనట్లయితే షెడ్డు నిర్మాణం చేపట్టరాదు. నేల చదునుగా లేనట్లయితే షెడ్డు నిర్మాణపు ఖర్చు హెచ్చుతుంది. షెడ్డులోని నేల చెమ్మగా ఉండకుండేందుకు కనీసం 6 అంగుళాల ఎత్తులో ఉండే విధంగా లేక ఇంకా ఎత్తలో ఉండే విధంగా షెడ్డు నిర్మాణం చేపట్టాలి. రోడ్డు, నీరు, విద్యుచ్ఛక్తి వంటి సదుపాయాలు అందుబాట్లో ఉండే విధంగా స్థలం ఎంపిక చేసుకోవాలి.

ముఖ్యంగా మాంసం కోళ్ళ షెడ్లు, బ్రూడింగ్ షెడ్లవలె నిర్మించుకోవాలి. చలి అధికంగా ఉండే ప్రాంతాలైతే సమస్యలు ఎక్కువ. షెడ్లు విశాలంగా ఉండాలి. వాటికిరువైపులా అవసరానుసారంగా సర్దుకునే వీలు కలిగిన పరదాలు అమర్చుకోవాలి. షెడ్డుకు ఇరుప్రక్కల ఎత్తు 7-8 అడుగులు, మధ్యభాగంలో 12-14 అడుగులు ఉండాలి. ప్రక్కగోడలు 1.1/2 నుండి 2 అడుగుల ఎత్తువరకు ఉండవచ్చు. పై కప్పుకు కూడా గాలి ప్రసరణానికి (రిట్జ్ వెంటిలేషన్) అనువైన ఏర్పాట్లు చేసుకోవాలి. వర్షపు జల్లుగాని, ఎండగాని షెడ్లలోకి ప్రవేశించకుండా షెడ్డు కప్పును ఇరువైపులా చూరు తగినంతగా పొడగించాలి. 3000 నుండి 6000 కోళ్లుండే షెడ్లో ఓ చివరగాని షెడ్డు మధ్యభాగంలోగాని దాణాకై ఓ గదిని నిర్మించుకోవడం మంచిది. మాంసం కోళ్ళు గుంపులుగా ఉన్నప్పుడే ఎక్కువ ఫలితాలనిస్తాయి. అయితే ఓ గుంపులో 1000-3000 వరకే పెంచాలి. షెడ్డు యొక్క పొడవు తూర్పు - పడమరలకు విస్తరించి ఉండాలి. ఇలా చేయడం వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండ కోళ్ళకు తగలకుండా ఉంటుంది. అంతేకాదు వర్షపుజల్లు షెడ్డులోకి ప్రవేశించదు. షెడ్డులో ఉష్ణోగ్రత అతి ఎక్కువగా ఉన్నా, అతి తక్కువగా ఉన్నా, ఎక్కువగా తేమగా ఉన్నా ఎక్కువ పొడిగా ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉండవు. షెడ్లో ఉష్ణోగ్రత $70^0$-$80^0$ ల ఫారన్హీట్ ఉండడం ఆశించదగ్గది.

షెడ్డు పారిశుధ్యానికి తగినంత సమయం ఇస్తే వీలైనన్ని ఎక్కువ బ్యాచీలు షెడ్డుకు తగిన సంఖ్యలో పెంచినట్లయితే చాలా లాభదాయకం. 6-5 నుంచి 5-7 బ్యాచీల కోళ్ళను ఒక షెడ్డులో పెంచవచ్చు.

### 7.4 గాలి ప్రసరణ :

కోళ్ళ పెంపకంలో గాలి ప్రసరణం ఎంతో ప్రాముఖ్యాన్ని కల్గి ఉంది. కోళ్ళకు అవసరమైన ఆక్సీజన్ అందజేయడం, కోళ్ళు విసర్జించిన కార్మన్ డయాక్సైడ్ను బయటికి పంపివేయడం, అమ్మోనియా వంటి ఇతర వాయువులను బయటికి పంపించడం, షెడ్డులోని తేమను, ఉష్ణోగ్రతను తగినంతగా ఉండేవిధంగా నియంత్రించి, వ్యాధులు రాకుండా చేయడం మొదలైనవి గాలి ప్రసరణం యొక్క విధులు.

ఈదురు గాలులు కాకుండ తగినంత మోతాదులో గాలి వీయడం వల్ల షెడ్డులోని లిట్టరు ఎల్లప్పుడు పొడిగా ఉంటుంది. గాలి ప్రసరణం  అసలే లేని పక్షంలో కోళ్ళు శ్వాస సంబంధమైన వ్యాధులకు గురౌతాయి, తద్వారా ఎన్నో చెడు ఫలితాలు కలుగుతాయి.

మాంసం కోళ్ళ గాలి ప్రసరణాన్ని ఎప్పుడూ కనిపెట్టుకొని ఉండాలి. ముఖ్యంగా శీతాకాలంలో వాతావరణంలో కలిగే మార్పులకు అనుగుణంగా ఎన్నో మార్పులు చేయవలసిరావచ్చు. బ్రాయిలర్ కోళ్ళ వయసులో పెరిగేకొద్దీ గాలి ప్రసరణ కూడా పెంచుతూ పోవాలి. లేనియెడల షెడ్డు వాతావరణంలో అమ్మోనియా పేరుకు పోతుంది. షెడ్లో చిన్న పిల్లలున్నప్పుడు గాలి ప్రసరణం ఎక్కువగా ఉంటే పిల్లలు చలికి గుర్రై మరణించే అవకాశం ఉంది. గాలిలో అమ్మోనియా 20 పి.పి.యం.ల స్థాయి మించినట్లయితే ఈ క్రింది తెలిపిన కొన్ని దుష్ఫలితాలు కలగవచ్చు.

ఎ) రాణీఖేట్ వ్యాధికి గురికావడం.

బి) పెరుగుదల క్షీణిస్తుంది. దాణా వినిమయ నిష్పత్తి పెరుగుతుంది.

సి) 50 పి.పి.యం.లకు కూడా మించితే గుడ్డితనం వస్తుంది.

లిట్టర్లోని పొట్టులో తేమ 21-25 శాతానికి మధ్య ఉన్నట్లయితే అమ్మోనియా ఉత్పత్తి కాదు. లిట్టర్లో తేమశాతం 30కి దాటగానే ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ అమ్మోనియా ఉత్పత్తి పెరుగుతుంది. చలికాలంలో గాలి ప్రసరణం మరీ తక్కువ కాకుండా తగినంతగా ఉండాలి. వేసవిలో గాలి ప్రసరణం బాగా ఉండాలి. షెడ్డు ఉష్ణోగ్రత తక్కువగా ఉండాలి. అందుకై షెడ్డు పై కప్పుకు వెల్ల వేయించాలి, కప్పుపైన నీటిని వెదజల్లే స్ప్రింకర్లు అమర్చుకోవాలి. వేసవిలో కేజీ బరువున్న ఒక కోడికి నిమిషానికి 2 ఘనపుటడుగుల గాలి అవసరమవుతుంది. లిట్టరు తడిగా ఉండడం, షెడ్లో అమ్మోనియా వాసన రావడం, షెడ్లో సాలెగూళ్ళుండడం మొదలైనవి గాలి ప్రసరణ సరిగా లేదనడానికి నిదర్శనాలని గమనించాలి.

### 7.5 పిల్లలు వచ్చే ముందు షెడ్డు పారిశుద్యం :

సరైన పారిశుధ్య పద్ధతి అంటే ఏమిటి, అది ఎందుకు అవసరం, దాన్ని ఎలా పాటించాలి అనే అంశాలు రైతుకు క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. చాలా రకాల వ్యాధికారక క్రిములను సరైన మందులను ఉపయోగించి, సరైన పద్ధతిలో షెడ్డును శుభ్రపరిచినప్పుడే నశింప జేయగలుగుతాము. షెడ్డులోని లిట్టరును నిర్మూలించడంతో పారిశుధ్యం ప్రారంభమవుతుంది. లిట్టరు వరకు నిర్మూలించాక నేలను బ్రష్ల సహాయంతో శుభ్రంగా రుద్ది కడగాలి. ఈ విధంగా శుభ్రపరిచిన నేలను మందు నీటితో కూడా తుడవాలి. షెడ్లో ఏవైనా సాలెగూళ్ళు, కోడి ఈకలు మిగిలి ఉంటే తీసివేయాలి. పై కప్పును కూడా నీటితో శుభ్రపరచాలి. 3-5శాతం క్రిసాల్ ద్రావణాన్ని పారిశుధ్యానికి వినియోగించవచ్చు. క్వాటర్నరీ అమ్మోనియం కాంపౌండ్లయితే 100 పి.పి.యం. స్థాయిలో వాడుకోవాలి. (1:5000) సరైన పద్ధతిలో ఆయా ప్రదేశాలను శుభ్రపరిచాకనే ఈ మందుల ద్రావణాలతో తుడవాలి. షెడ్డు పూర్తిగా శుభ్రపరచిన పిదప ఈగలు, పేలు, కొణుజులు, ఇతర కీటకాల నిర్మూలనకై మలాథియాన్ను ఉపయోగించవచ్చు. ప్రతి బ్యాచికి మధ్య షెడ్డుకు తప్పనిసరిగా వెల్ల వేయించాలి.

### 7.6 లిట్టర్లు :

ఎన్నో రకాల లిట్టర్లు వాడుకలో ఉన్నాయి. అయితే ధూళి, దుమ్ము రూపంలో ఉన్నది కాక తేమను పీల్చుకోగలిగేదే సరైన లిట్టరని గుర్తించాలి. వాడే లిట్టరు వాసనతోను, బూజుతోను విషపదార్థాలతోను కూడుకొని ఉండరాదు. మొక్కజొన్న కంకులపొడి, చెక్కపొట్టు, వేరుశనగ పొట్టు, వరి పొట్టు, ప్రతి గింజల పొట్టు మొదలైన పదార్థాలను వీలునుబట్టి వాడుతుంటారు. షెడ్లోని నేలపై 3-4 అంగుళాల ఎత్తువరకు లిట్టరుండాలి. అంతకన్నా తక్కువ ఎత్తు లిట్టరు ఉండడంవల్ల లిట్టరు ఊరికే తడిసిపోతుంది. అట్టలు కడుతుంది. కోళ్ళ సంఖ్య ఎక్కువగా ఉండడం, గాలి ప్రసరణం సరిగా లేకపోవడం వల్ల కూడా ఈ సమస్యలు తలెత్తవచ్చు. తడి ఎక్కువగా ఉండే కాలాల్లో లిట్టర్ను తరచు దున్నుతుండాలి. ఎల్లప్పుడు

లిట్టరు పొడిగా ఉండేట్టు చూసుకోవాలి. బ్రూడర్లు ఎత్తివేశాక బ్రూడర్ ప్రాంతంలోని లిట్టర్ని కూడా దున్నాలి. ఒక బ్యాచిలో ఎలాంటి వ్యాధులు తలెత్తనప్పుడు, ఆ లిట్టర్ని వేరొక బ్యాచికి వాడుకోవచ్చును. అయితే దీనికి ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆ జాగ్రత్తలు క్రింద సూచించబడినవి.

1. మునుపటి బ్యాచిలో వ్యాధులు తలెత్తనట్టయితే లిట్టరును తిరిగి వాడవచ్చు.
2. కోళ్ళు మొత్తం తీసివేయాలి.
3. షెడ్డు, గోడలు, పైకప్పు మరియు లిట్టరుపై మంచి కీటకనాశక మందుని (స్ప్రే చేయాలి).
4. తడిచిన, అట్టలు గట్టిన లిట్టర్ను వేరుచేయాలి.
5. అన్ని పరికరాలను పూర్తిగా శుద్ధిచేయాలి.
6. లిట్టర్ని పూర్తిగా ఎండబెట్టాలి.
7. అవసరమైతే కొద్దిగా కొత్త లిట్టరు కలుపుకోవాలి

లిట్టరు విషయంలో ముఖ్యంగా గుర్తుంచుకోదగ్గది తమే శాతం 20-25 వరకు ఉండాలి. తేమ శాతం 20 కన్నా లోపుగా ఉంటే ధూళి సమస్య తలెత్తుతుంది. అదే 25 శాతం పైగా ఉంటే లిట్టరు తడితడిగా ఉండి అట్టలు కడుతుంది. లిట్టర్ను చేతిలోకి తీసికొని పిసికి చూసినప్పుడు ఉండవలె మారినట్టయితే తేమ 25 శాతం పైగా ఉన్నట్లు గ్రహించాలి. అధిక తేమను నిరోధించడానికి మంచి నిర్వహణ పద్ధతులనవలంభించాలి. గాలి ప్రసరణం, షెడ్డు ఉష్ణోగ్రత తగినంతగా ఉండాలి. నీటి తొట్ల నుండి నీరు బయటికి పడిపోకుండా, నీటి తొట్లు కారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కోళ్ళు 5వ వారానికి చేరుకున్న తరువాత లిట్టరు. క్రమంగా తడిగా మారుతుంది. ఈ సమయంలోనే కాక్సీ వంటి సమస్యలు తలెత్తుతాయి. కోళ్ళు ఈ మధ్య వయసులో త్వరితగతిని ఎదుగుతుండడం మూలాన దాణా, నీటి వినియోగం పెరగడం తద్వారా కోళ్ళు ఎక్కువ రెట్టను విసర్జించడంతో షెడ్డు కాస్త ఇరుకుగాను, లిట్టరు తడితడి గాను తయారవుతుంది. ఈ విధంగా లిట్టరు పరిస్థితి క్షీణిస్తుంది. ఇలాంటి లిట్టరును దున్నడం వల్ల అట్టలు కట్టకుండా నివారించగల్గుతాము. అంతేకాదు సున్నం కలిపి దున్నడం వల్ల ఎల్లప్పుడు పొడిగా ఉండేట్లు చూడవచ్చు.

### 7.7 బ్రూడర్లు :

కోడి పిల్లలకు తగినన్ని ఈకలు పెరిగే వరకు వాటికి తగినంత ఉష్ణోగ్రత అవసరం. బ్రూడర్లో ప్రతి కోడిపిల్లకు 10 చదరపు అంగుళాల స్థలాన్ని కేటాయించాలి. బ్రూడర్ షెడ్లో మొదటి 4-5 రోజుల ఉష్ణోగ్రత

70$^0$-75$^0$ ఫారన్ హీట్ ఉండాలి. తరువాత 65$^0$-75$^0$ వరకు ఉండవచ్చు. బ్రూడర్ అట్టకు బ్రూడర్ అట్టకు మధ్య 25-30 అంగుళాలు $^0$F దూరం ఉండాలి. అదే వేసవిలో ఉండాలి. రోజులు గడిచే కొద్దీ బ్రూడర్ అట్టలను దూరం జరుపుతూపోయి 10-14 రోజులు వచ్చేసరికి అట్టలను ఈ బ్రూడర్ రింగులను తీగవలతో తయారు చేసినవి ఉపయోగించవచ్చును. కోడి పిల్లలను వీలైనంత వరకు ఉదయం పూటే తెప్పించుకోవాలి. అలా చేయడం వల్ల పిల్లలు నీటికి, దాణాకు సులభంగా అలవాటు పడతాయి. కోడి పిల్లలు వచ్చే 24 గంటల ముందునుండే పరికరాలన్నీ బ్రూడర్లో అమర్చి ఉంచాలి. ఒకరోజు వయసున్న కోడి పిల్ల ఉష్ణోగ్రత పెద్ద కోళ్ళలో కంటే 3$^0$F తక్కువగా ఉంటుంది. 4వ రోజునుండి వాటి శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ 10వ రోజుకల్లా గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. కాబట్టి ఉష్ణోగ్రత నియంత్రించడానికి కొన్ని రోజుల వరకు బ్రూడర్ అట్టలను అమర్చవలసి ఉంటుంది. బ్రూడర్లో ఉష్ణోగ్రత 90$^0$-95$^0$ ఫారన్ హీట్ ఉండాలి. ఈ ఉష్ణోగ్రత వారానికి 5$^0$ ఫార్వనీట్ చొప్పున తగ్గిస్తూ పోవాలి.



కోడి పిల్లల్ని గమనించి తగిన విధంగా ఉష్ణోగ్రతలో మార్పు చేయడానికి అన్నివిధాల సాయంత్రపు వేళలే అనుకూలంగా ఉంటాయి. శ్వాస సంబంధమైన ఇబ్బందుల్నీ, వ్యాక్సినేషన్ రియాక్షన్లు వంటి సమస్యలను కూడా సాయంత్రం వేళల్లోనే సులభంగా పసికట్టవచ్చు. షెడ్డులో అమర్చుకున్న ఉష్ణమాపకాలు (థర్మామీటర్) అప్పుడప్పుడు సరిగా పనిచేయవు. కాబట్టి కోడి పిల్లలు సౌఖ్యంగా ఉన్నాయా లేదా అన్నది ఆ కోడి పిల్లల ప్రవర్తన ద్వారానే తెలుసుకోవాలి. కోడి పిల్లల ప్రవర్తన ద్వారా ఉష్ణోగ్రతను ఏవిధంగా తెలుసుకోవచ్చో పటంలో చూడొచ్చు. పిల్లలు వచ్చే ముందు బ్రూడర్లలో దాణా, నీరు వేసి ఉంచాలి. పిల్లల్ని బ్రూడర్లో వేయగానే వాటికి దాణా, నీరు అందుబాట్లో ఉండాలి. కోడి పిల్లలు ఉత్పత్తి అయిన 24 గంటలలోనే వాటికి దాణా, నీరు లభింపజేయాలి. ఎండ అధికంగా ఉన్న సమయంలో పిల్లలు వచ్చినట్లయితే వాటి ముక్కులను నీటిలో ఒకసారి ముంచి బ్రూడర్లో వదలాలి.

నర్సరీలలో పెరిగే పిల్లలకు కావల్సిన పోషకాలు అంటే శక్తి, ప్రోటీన్స్, విటమిన్స్, మినరల్స్ నిర్ధారించిన మోతాదులో ఇవ్వాలి. కోడి పిల్లలన్నీ ఒకేసారి తినగలిగేటట్లు దాణా తొట్టెలు అమర్చాలి. రోజుకి రెండు పూటలా అంటే దయం, సాయంత్రం దాణా వేయాలి. దానాలో 2400 కి. కేలరీల శక్తి, ప్రోటీన్స్ 16%, లైసిన్ (0.77%) మిథియోనైన్ (0.36%) కాల్షియం, పాస్పరస్ ఉండేలా చూసుకోవాలి.

## 8. పెరటి ప్రదేశాలలో యాజమాన్యం :

నర్సరీలలో పెంచిన కోళ్ళను 8 వారాల వయస్సులో పెరటి ప్రదేశాలలో పెంచుకోవచ్చు, ఒక్కో ఇంటికి ఆరుబయట 10-20 పిల్లలను పెంచుకోవచ్చు. రాత్రిపూట ఉండటానికి కోళ్ళగూడు లేదా గంపలను తయారుచేసుకోవాలి. గూడులోపలకు పాములు, ఎలుకలు, పిల్లులు మరియు కుక్కలు వంటి జంతువులు ప్రవేశించకుండా చూడాలి. పగటిపూట పిల్లలు, కుక్కల బారినుండి రక్షించాలి. ప్రతిరోజు కోళ్ళను బయటకు విడిచేముందు పరిశుభ్రమైన నీటిని ఇవ్వాలి. రాజశ్రీ గ్రామప్రియ కోళ్ళు 6 నెలల వయస్సు నుండి గుడ్లు పెట్టడం ప్రారంభించి సంవత్సరానికి 150 గుడ్ల వరకు పెడతాయి. గుడ్ల కోడి పెట్ట బరువు 2.2-2.5 కి.గ్రా. కన్నా అధికంగా పెరగనివ్వకూడదు. గుడ్లు పెట్టే కోడికి 3-4 గ్రాములు ఆలుచిప్పల పొడి / సున్నపు రాయిని వారానికి రెండుసార్లు ఇవ్వాలి. లేకపోతే తోలు గుడ్లు , పలుచని పెంకు గుడ్లు వస్తాయి. ఇంకా దాణా విషయానికొస్తే, ఇవి పెరటి బయళ్ళలో దొరికే క్రిమికీటకాలు, నత్తలు, గింజలు, వంటగది వ్యర్థాలు తింటాయి. ఈ క్రిమికీటకాలలో వీటికి కావాల్సిన ప్రోటీన్స్ దొరుకుతాయి. కాని శక్తి లభ్యం కాదు. ఇది లభ్యమయ్యే ఆహార వనరుల మీద ఆధారపడి ఉంటుంది. అప్పుడప్పుడు మన స్థానికంగా లభ్యమయ్యే జొన్నలు, వరిధాన్యాలు, సజ్జలు, తౌడు మొదలైనవి ఇవ్వడం వలన కోళ్ళు ఆరోగ్యంగా పెరుగుతాయి. ఒకవేళ లూసర్స్, బర్సిమ్ వంటి పచ్చిమేత అందుబాటులో ఉన్నయెడల చిన్నచిన్న ముక్కలుగా తిరిగి ఒక్కొక్క కోడికి 50-100 గ్రాముల ఇచ్చినప్పుడు కూడా అధికోత్పత్తి సాధించవచ్చును. ఈ మధ్య పశువుల మేతగా ప్రాచుర్యం పొందిన “అజోల్లా”లో కూడా మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. అందుబాటులో ఉన్న యెడల 50 గ్రాముల అజొల్లా ఇచ్చినప్పుడు గ్రుడ్లోత్పత్తిలో బాగా పెరుగుదల గమనించవచ్చును. కోళ్ళు ఆరుబయట తిరుగుతాయి. కాబట్టి అంతరపరాన్న జీవుల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటిని నివారించడానికి పైపరాజిన్ ఆడిపేట్ అనే నట్టల మందును ఒక చెంచాడు చొప్పున అర లీటర్ నీటిలో కలిపి ఒక్కో కోడికి 5-10 మి.లీ. త్రాగించాలి. ఇలా ప్రతి మూడు నెలలకు ఒకసారి చేయాలి. అలాగే క్రమం తప్పకుండా కొక్కెర వ్యాధి టీకాలు వేయించటం ద్వారా కోళ్ళకు వ్యాధి రాకుండా నివారించవచ్చు.





# 9. దేశవాళీ కోళ్ళ యొక్క పోషణ

కోళ్ళ పెంపకానికి అయ్యే ఖర్చులో 70% వరకు ఒక్క దాణాకే ఖర్చు అవుతుంది. కాని పెరటి కోళ్ళ పెంపకానికి దాణా ఖర్చు తక్కువగా ఉండును. పెరటి కోళ్ళు పగటి వేళలలో ఇంటి పెరటిలో మరియు పచ్చిక బయళ్ళు, పొలాలలో దొరికే గడ్డి గింజలు, కీటకాలు, నత్తలు, చెదలు మొదలగు వాటిని ఆహారంగా తీసుకొనును. కానీ వాణిజ్య సరళిలో ఎక్కువ మొత్తంలో మాంసం కొరకు నాటుకోళ్లను పెంచినపుడు మార్కెట్లో లభ్యమయ్యే లేయర్ దాణాను మొదటి 2 నెలల వరకు వాడి తదుపరి మార్కెటింగ్ దశ వరకు అనగా 3-4 నెలల వరకు కోళ్లను పాక్షిక సాంద్రతర పద్ధతిలో పగటి వేళలో బయటకి వదలవలెను. ఈ విధంగా చేయడం వలన దాణాకు అయ్యే ఖర్చును తగ్గించుకొని లాభాలు పొందవచ్చు. రాజశ్రీ కోళ్ళలో దాణా వినియోగ సామర్థ్యం 0-8 వారాలకు 1.5 కే.జి. గాను మరియు 9-16 వారాలకు 3.5 - 4.0 కే.జి.ల వరకు ఉండును.


కోడిని ఒక యంత్రం లేదా కర్మాగారంతో పోల్చవచ్చు, ఇది గ్రామీణ వాతావరణంలో లభించే సేంద్రీయ వ్యర్థ పదార్థాలను పోషకమైన ప్రోటీన్లుగా (గుడ్లు లేదా మాంసం) మారుస్తుంది. దేశీ చికెన్ ఇంటి చుట్టూ లభించే మేత మరియు కీటకాలను చాలా తెలివిగా మరియు చురుకుదనంతో పొందుతుంది. దీని కారణంగా కోళ్లకు శక్తి వినియోగించబడుతుంది. దీని వల్ల కోళ్లకు ప్రయోజనం చేకూరుతుంతుంది. గ్రామీణ పశువుల పెంపకందారులు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తక్కువ పరిమాణంలో కోళ్ల దాణాను అంధచేస్తే , వాటిని కోళ్లు 1 కిలో శరీర బరువుకు చేరుకోవడానికి తక్కువ సమయం పడుతుంది మరియు పశువుల పెంపకందారులకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. అంతేకాకుండా, కోళ్ల దాణాకై గ్రామంలో లభించే తక్కువ ఖర్చుతో కూడిన పోషక పదార్థాలను జోడించడం ద్వారా కోళ్ల దాణాపై ఖర్చు కూడా తగ్గించవచ్చు.


## కింది చర్యలు తీసుకోవచ్చు-

1. నీరు చౌకైన మరియు ప్రధాన ఆహార పదార్థం. జీవించే కోడిలో 55-60 శాతం నీరు మాత్రమే ఉంటుంది. ఆహారాన్ని మృదువుగా చేయడం మరియు జీర్ణం చేయడం, జీర్ణమైన ఆహారాన్ని రక్తంలోకి తీసుకువెళ్లడం, శరీరం నుండి వ్యర్థ పదార్థాలను తొలగించడం మరియు శరీర ఉష్ణోగ్రతను నిర్వహించడం.

2. కోళ్లకు క్రమం తప్పకుండా పచ్చి మేత మరియు స్థానికంగా లభించే దాణాను అందించడం ద్వారా, వాటిని స్వయంగా మేపడం కంటే వాటి పెరుగుదల వేగంగా ఉంటుంది, ఇది గ్రామీణ పశువుల పెంపకందారులకు ప్రయోజనం చేకూరుస్తుంది.

3. పైన పేర్కొన్న చర్యలను అనుసరించడం ద్వారా, స్థానిక కోళ్లలో వ్యాధుల సంభవం కూడా తగ్గుతుంది. ఆరోగ్యకరమైన కోడిలో, ఆహారం వ్యాధులతో పోరాడటానికి ఉపయోగించబడదు కానీ గుడ్లు మరియు మాంసాన్ని ఉత్పత్తి చేస్తుంది.




## పౌల్ట్రీ ఫీడ్ భాగాలు మరియు వాటి ప్రాముఖ్యత యొక్క సంక్షిప్త వివరణ

| క్రమ సంఖ్య | అంశం | శరీరం లోపల పని | లభిస్తాయి |
|---|---|---|---|
| 1) | నీరు | జీర్ణక్రియ, శరీర ఉష్ణోగ్రతను నిర్వహించడం, శరీరం ద్వారా ఆహారాన్ని తీసుకువెళ్లడం, శరీరం నుండి అనవసరమైన అంశాలను తొలగించడం. | నీరు, తాజా పచ్చి మేత |
| 2) | కార్బోహైడ్రేట్లు | వేడి, శక్తి మరియు ఉత్పాదకత కోసం. | మొక్కజొన్న, బార్లీ, జొన్న, రైస్ పాలిష్, కనకి |
| 3) | ప్రోటీన్ | పెరుగుదల, కణజాల నిర్మాణం, గుడ్డు మరియు మాంసం ఉత్పత్తి ఉత్పాదకత కోసం. | వేరుశెనగ, నువ్వులు మరియు సోయాబీన్ కేక్, పప్పు తొక్క, చేపల పొడి, పచ్చి మేత (బార్సీమ్) |
| 4) | ఖనిజాలు | ఎముకల నిర్మాణం, గుడ్డు ఉత్పత్తి, శరీరంలోని అన్ని వ్యవస్థలకు | ఎముక పొడి, ఉప్పు, సున్నపు షెల్/పాలరాయి పొడి, |
| 5) | విటమిన్ | మొత్తం ఆరోగ్యం మరియు మెరుగైన గుడ్డు మరియు మాంసం ఉత్పత్తి కోసం. | పచ్చి మేత, మొక్కజొన్న, చేపల |
| | | | పొడి , ధూపం |

## స్థానికంగా దొరికే ముడిపదార్థాలతో దాణా తయారు చేయుట :

| క్ర.సంఖ్య | ముడి పదార్థం పేరు | కలపవలసిన పాళ్లు |
|---|---|---|
| 1 | మొక్కజొన్న / సజ్జలు / రాగులు / జొన్నలు / నూకలు | 50 పాళ్లు |
| 2 | వరి తవుడు / గోధుమ తవుడు / నూనె తీసిన వరి తవుడు | 20 పాళ్లు |
| 3 | సోయామీల్ / వేరుశనగ చెక్క / ప్రొద్దు తిరుగుడు చెక్క / నువ్వుల చెక్క | 28 పాళ్లు |
| 4 | విటమిన్ మరియు లవణ మిశ్రమం | 2 పాళ్లు |

## 9.1 పచ్చి మేత

పచ్చి మేత ప్రోటీన్, ఖనిజాలు మరియు విటమిన్ల యొక్క మంచి మూలం, ఇది అన్ని వయసుల కోళ్లకు ఇవ్వాలి. కోళ్ల ఆరోగ్యానికి, గుడ్ల ఉత్పత్తికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆకు పచ్చని మేతను పుష్పించే ముందు కోసి కోళ్లకు ఇస్తే వాటికి ప్రొటీన్లు, మినరల్స్, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. పచ్చి మేతలో బార్సీమ్ మరియు ఆవుపేడ ఉత్తమమైనదిగా పరిగణించబడుతుంది. ఇది కాకుండా, క్యాబేజీ, క్యారెట్, ముల్లంగి మొదలైన వాటి ఆకులు మరియు బచ్చలికూర వంటి కూరగాయలలో ఉపయోగించని ఆకుల భాగాలను కూడా ఇవ్వవచ్చు. కోళ్ల దాణాలో కూడా అజోల్లా ఇవ్వవచ్చు. పచ్చి మేతను శుభ్రమైన నీటితో కడిగి కోసి ఇవ్వాలి.

పచ్చి మేత కింది పరిమాణంలో ఇవ్వాలి.

కోడి- రోజుకు 30 నుండి 50 గ్రాములు

కోడిపిల్ల- రోజుకు 20 నుండి 30 గ్రాములు



**కోడి దాణాకు చెదపురుగుల వాడకం**


- పాత కాటన్ గుడ్డ/సాక్స్ ముక్కలు
- ఎండిన ఆవు పేడ మరియు కొన్ని పచ్చి ఆవు పేడ
- పొడి చెక్క ముక్కలు
- చెదపురుగులు
- కుండను తలక్రిందులుగా ఉంచి, దాని చుట్టూ 2-3 రోజులు నీరు చల్లండి.
- కుండను తిప్పడం ద్వారా, చెదపురుగుల కోడిపిల్లలకు ఆహారం ఇవ్వవచ్చు. దీంతో వారికి మంచి ప్రొటీన్లు అందుతాయి. ఇది మంచి పురోగతికి దారితీస్తుంది.

## 10. గుడ్ల క్యాండిలింగ్ (పిండ పరీక్ష)

గ్రామీణ సాంప్రదాయ పౌల్ట్రీ పెంపకం విధానంలో, కోళ్ళ నుండి పొందిన గుడ్లు అన్ని కోళ్ళ క్రింద ఉంచబడతాయి. ఈ విధంగా, కోడి ఈ గుడ్లను సహజ పద్ధతిలో పొదిగిస్తుంది, దీని నుండి 21 రోజుల తర్వాత కోడిపిల్లలు పుడతాయి.

గుడ్లు రెండు రకాలు - శాఖాహారం మరియు మాంసాహారం. శాకాహార గుడ్లు మగ పక్షులు లేనప్పుడు ఆడ పక్షులు పెడతాయి, అందువల్ల వాటిలో పిండం (పిల్లవాడు) ఉండదు. ఆడ పక్షులను మగ పక్షులతో సంతానోత్పత్తి చేసిన తరువాత, అవి పిండం ఉన్న మాంసాహార గుడ్లను పొందుతాయి. ఈ రకమైన గుడ్ల నుండి కోడిపిల్లలు 21 రోజుల పాటు కోడి కింద ఉంచిన తర్వాత బయటకు వస్తాయి.

కోడి గుడ్లను పొదిగేందుకు కోళ్ల కింద ఉంచే ముందు పిండాలను పరీక్షించేందుకు ఉపయోగించే యంత్రాన్ని క్యాండిలర్ అంటారు. సాధారణంగా, ఇది ఒక స్థూపాకార టిన్ బాక్స్, ఇది ఒక చివర బల్బ్ మరియు మరొక చివర రంధ్రం కలిగి నేలపై చీకటి గదిలో డబ్బాలో ఉంటుంది.



### పెట్టె కొవ్వొత్తి

- 1. గ్రామీణ కుటుంబాలలో, దాదాపు ప్రతి ఇంట్లో టిన్ డబ్బాలు సులభంగా లభిస్తాయి. ఒక సాధారణ టిన్ బాక్స్ తీసుకొని, ఉలి మరియు సుత్తి సహాయంతో, పెట్టె యొక్క గుండ్రని మధ్యలో సుమారు 3 సెం.మీ. వ్యాసం యొక్క వృత్తాన్ని కత్తిరించండి.
- 2. పెట్టె కింది చివర బల్బ్ హోల్డర్ సైజులో ఉండే వృత్తాన్ని కట్ చేసి, అందులో హోల్డర్‌ను అమర్చి, విద్యుత్ కనెక్షన్‌కి కనెక్ట్ చేసి బల్బును వెలిగించండి.
- 3. ఈ పెట్టెను నేలపై ఉంచడానికి ఒక స్టాండ్ కూడా తయారు చేయవచ్చు. లేదా పెట్టెను ఇలా ఉంచుకోవచ్చు.
- 4. విద్యుత్తు అందుబాటులో లేని సందర్భంలో, ఒక టార్చ్ కూడా ఒకేసారి 10-15 గుడ్ల పిండాలను పరీక్షించడానికి ఉపయోగించవచ్చు.
- 5. దీని కోసం, సాధారణ పొడి లేదా టిన్ యొక్క పొడవాటి పెట్టెను తీసుకొని దిగువ భాగాన్ని తీసివేసి పై ఉపరితలంపై రంధ్రం చేసి మంటను వెలిగించి పెట్టె లోపల ఉంచండి.

- 6. కార్డ్‌బోర్డ్‌ను వృత్తాకారంలో మడిచి, టార్చ్ ఆకారంలో చేయండి. గుడ్డును పరీక్షించడానికి కార్డ్‌బోర్డ్ నుండి మూత తయారు చేసి, పైభాగంలో రంధ్రం చేయండి.
- 7. ఇప్పుడు అట్ట లేదా పౌడర్ లేదా టిన్ బాక్స్ లోపల టార్చ్ వెలిగించి పైన రంధ్రాలు ఉన్న మూత పెట్టి, టార్చ్ వెలుగులో గుడ్ల పిండాన్ని పరీక్షించండి.
- 8. ఏదైనా కొవ్వొత్తిని క్రమం తప్పకుండా ఉపయోగించే ముందు ఈ పద్ధతిని బాగా ఆచరించడం చాలా ముఖ్యం.

### కొవ్వొత్తి యొక్క ప్రయోజనాలు

కొవ్వొత్తుల నుండి, పిండం రహిత గుడ్లు, లేకపోతే వాటిని పొదిగేందుకు కోడి కింద ఉంచుతారు, వాటిని వేరు చేసి తినడానికి లేదా విక్రయించడానికి ఉపయోగిస్తారు. ఈ విధంగా, గుడ్లు వృధా కాకుండా కాపాడుకోవడమే కాకుండా అదనపు ఆదాయ వనరుగా కూడా మార్చుకోవచ్చు. అలాగే పరిమిత సంఖ్యలో గుడ్లు ఉండడం వల్ల కోడి శరీర ఉష్ణోగ్రత అన్ని గుడ్లపై సమానంగా పడి పొదిగే శాతం ఎక్కువగా ఉంటుంది.

## 11. పెరటికోళ్ళలో సాధారణంగా వచ్చే వ్యాధులు వాటి నివారణ :

సాదారణంగా పెరటికోళ్లు చెత్తాచెదారం, పురుగులు, గింజలు ఏరుకుని తిని జీవిస్తాయి. కలుషితమైన నీరు కూడా త్రాగుతాయి. అందువల్ల ఇవి వివిధ రకాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఇందులో కొన్ని వ్యాధులకు టీకాలు వేయించడం ద్వారా అరికట్టవచ్చు. మరికొన్ని వ్యాధులను ముందు జాగ్రత్త చర్యలతో నివారించవచ్చు.

### 11.1 కొక్కెర వ్యాధి :

ఈ వ్యాధి సోకిన కోడికి ఆకుపచ్చ నీళ్ళ విరోచనాలు, దగ్గు, గురక, శ్వాస తీసుకోకపోవడం, తల మరియు మెడ ఒక వైపు వాలి ఉండటం, జుట్టు నల్లబడటం, పక్షవాతం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి ఎక్కువగా వేసవికాలంలో వ్యాప్తి చెందుతుంది. ఒకసారి వ్యాధి సోకిన తర్వాత నివారంచడం చాలా కష్టం. దీనికి చికిత్స టీకాలు వేయించడం, అది కూడా వ్యాధి వచ్చిన తర్వాత టీకా ఇస్తే లాభం లేదు. అందుకని వ్యాధి సోకకముందే అనగా నవంబర్, డిసెంబర్ నెలలో టీకాలు వేయిస్తే మంచిది. మొదటి వారం పిల్లలకు ఒక చుక్క టీకా మందును కంటిలో కాని ముక్కులోగాని వేయాలి. మళ్లీ తిరిగి అదే మందు 8-10 వారాల పిల్లలకు వేయాలి. ఇలా ప్రతి సంవత్సరం ఈ వ్యాధికి టీకా వేయటం ద్వారా కొక్కెర తెలుగు నివారించవచ్చు.





**కొక్కెర తెగులు సోకిన కోళ్లలో మెడ వెనక్కి ఉండటం (పక్షవాతపు లక్షణాలు)**

### 11.2 మసూచి వ్యాధి :

ఈ వ్యాధి సోకిన కోళ్ళలో అమ్మవారు లాగా పొక్కులు వస్తాయి. ముఖం, కళ్ళు, దవడలపై పొక్కులు వస్తాయి. ఈ వ్యాది వలన నష్టం తక్కువే అయినా కోళ్లు సరిగా మేత, నీరు తీసుకోక గ్రుడ్లు పెట్టడం తగ్గిపోతాయి. ఈ వ్యాది రాకుండా 10 వారాల వయస్సులో మసూచి వ్యాధి టీకాలు వేయాలి. చర్మం పైన ఉన్న పొక్కులు పుండ్లలాగ మారకుండా ఆంటీ బయోటిక్ ఆయింట్మెంట్ పూయాలి. లేదా పసుపు మరియు వేప నూనె మిశ్రమాన్ని పూతగా రాయాలి.






**మసూచి సోకిన కోళ్లు (పొక్కులు ఏర్పడటం)**

### 11.3 కొరైజా వ్యాధి :

ఈ వ్యాధి సోకిన కోళ్ళ కళ్ళు ఎర్రగా మారి నీరు కారుతాయి ముక్కు నుండి నీరు కారుతుంది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. శ్వాస తీసుకునేటప్పుడు గురక శబ్దం వస్తుంది. ఈ వ్యాధి నివారణకు ధయామ్యుటిన్ అనే మందును (ఒక చిటికెడు) ఒక కప్పు గ్లాసు నీళ్ళలో కలిపి రోజుకు 3 సార్లు త్రాగిస్తే నయమవుతుంది.





### 11.4. కాక్సిడియోసిస్ వ్యాధి :

ఈ వ్యాధి సోకిన కోళ్ళు నీరసంగా ఉండి, ఒక్కోచోట గుంపుగా కూర్చుంటాయి. రక్తంతో కూడిన విరోచనాలు, నిలబడి కునుకుతూ ఉండటం ఈ వ్యాధి ముఖ్య లక్షణం. శవ పరీక్షలో చిన్న మరియు పెద్ద ప్రేవులు వాచిపోయి రక్తంతో నిండి ఉంటుంది. ఆంప్రోలియం మరియు నైట్రోఫురోజోన్ వాడటం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చు.






### 11.5. తెలుపు విరోచనాలు :

ఈ వ్యాధి చిన్న కోడిపిల్లల్లో ఎక్కువగా వస్తుంది. వ్యాధి సోకిన కోళ్ళ విరోచనాలు తెలుపు లేదా లేత పసుపుపచ్చ రంగులో ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు ఫ్యూరజోలిడన్ అనే మందును చిటికెడు చొప్పున ఒక టీ గ్లాసులో కలిపి రోజుకు మూడు సార్లు పట్టిస్తే సరిపోతుంది.

### 11.6. నట్టల నివారణ :

నాటుకోళ్ళు అరుబయట తిరుగుతాయి కాబట్టి నట్టల సమస్య సర్వసాధారణం. కావున క్రమం తప్పకుండా నట్టల మందు త్రాగించాలి. ఈ నట్టల వల్ల కోళ్ళు సరిగా పెరగవు, బలంగా ఉండవు. కావున రైతు సోదరులు దగ్గరలోని పశువైద్యశాల నుండి “పైపరాజీన్” అనే మందును తెచ్చుకుని క్రమం తప్పకుండా త్రాగించాలి.

### 11.7. పేను మరియు నల్లుల నివారణ :

పేను మరియు నల్లుల వల్ల కోళ్ళు సరిగా పెరగవు. కోళ్ళు ఎంత తిన్నా పెరగవు. రక్తహీనతకు గురవుతాయి. కావున కోళ్ళ గూడును రోజు శుభ్రం చేయాలి. గూడుకు సున్నం వేయాలి. మూలల్లో ఉన్న

పేనును తొలగించడానికి పోగొట్టాలి. వీటి బెడద ఇంకా ఎక్కువగా ఉంటే బ్యూటాక్స్ (1 మి.లీ. మందు 1 లీ. నీటిలో) మందులో కోళ్ళను ముంచి తీయాలి. కోడి మెడ భాగం మరియు మిగతాభాగం నీటిలో ఉండేటట్లు జాగ్రత్త వహించాలి.

## పెరటి కోళ్ళకు చేయవలసిన టీకాలు

పెరటి కోళ్ళను ఆరోగ్యవంతంగా, వ్యాధులు రాకుండా ఉండుటకు వాటికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలను వేయవలెను.

| టీకా/వ్యాధి పేరు | వయసు | టీకా మోతాదు | టీకా వేయు ప్రదేశం |
|---|---|---|---|
| మారెక్స్ | ఒక రోజు | - | వదులుగా ఉన్న చర్మం క్రింద మెడ భాగంలో |
| కొక్కెర | 5-7 రోజులు | ఒక చుక్క | కంటిలో |
| గంబోరో | 14వ రోజు | ఒక చుక్క | కంటిలో |
| గంబోరో | 21వ రోజు | ఒక చుక్క | కంటిలో |
| కొక్కెర | 28వ రోజు | ఒక చుక్క | కంటిలో |
| అమ్మ తల్లి | 35వ రోజు | 0.2 మి.లీ. | కండలో ఇంజక్షన్ ద్వారా (తొడ / చాతి భాగంలో) |
| కొక్కెర | 56వ రోజు | 0.4 మి.లీ. | కండలో ఇంజక్షన్ ద్వారా (తొడ / చాతి భాగంలో) |

# 12 మార్కెటింగ్

రాజశ్రీ కోళ్లను ఫారాలలో సాంద్ర పద్ధతిలో ఎక్కువ సంఖ్యలో పెంచినపుడు శరీర బరువు 1.2 నుండి 1.4 గ్రాములు వచ్చిన నాటి నుండి మార్కెటింగ& చేసిన యెడల దాణా ఖర్చును తగ్గించుకోవచ్చు మరియు ఇట్టి శరీర బరువు గల కోళ్లకు మార్కెట్లో డిమాండ్ ఎక్కువ. రైతులు కోళ్ళు ఎక్కువ బరువు పెరుగుట కొరకు చూడకుండా మార్కెటింగ్ బరువు వచ్చిన నాటి నుండి మార్కెటింగ్ ప్రారంభించవలెను. మార్కెటింగ్ కొరకు దళారులను, మధ్యవర్తులను ఆశ్రయించకుండా సమీప మార్కెట్లో మరియు స్థానికంగా స్వతహాగా మార్కెటింగ్ చేసిన యెడల ఎక్కు లాభాలను పొందవచ్చు. సాధ్యమైనంత వరకు కోళ్ళలో వయసు మళ్ళినపుడు దాణా వినియోగ సామర్థ్యం తక్కువ ఉండును. కనుక నాటుకోళ్ళు 2 కిలో గ్రాముల కన్నా ఎక్కువ బరువు రాకుండా చూసుకోవాలి మరియు 2 కిలో గ్రాముల పైబడిన నాటు కోళ్ళు మార్కెట్లో ఆదరణ తక్కువ.

# 13. పెరటికోళ్ళ పెంపకములో ఆదాయ వ్యయాల వివరాలు :

## 13.1. మాంసము కొరకు పెరటి కోళ్ళ పెంపకం :

**ఉదా : వనరాజ మరియు శ్రీనిధి**

1. గ్రామీణ రైతు 100 మగ పిల్లలు కొనడానికి అయ్యే ఖర్చు (400 గ్రా. బరువు గలవి 1.5 నెలలు వయస్సులో అన్ని టీకాలు వేసినవి) 100×60.00=6,000 — 6,000/-
2. రాత్రిపూట కోళ్ళ గూడు నిర్వాణం కొరకు — 5,000/-
3. కొన్న పిల్లలలో 5% చనిపోయినవి అనుకుంటే మిగిలేవి 100-5=95 — 95
4. కొన్న 10 వారాల తర్వాత మిగిలిన 95 మగకోళ్ళను 1.5 నుండి 2 కేజీల (సరాసరి 1.75 కె.జి.) బరువు గలవి మాంసము కొరకు వచ్చే ఆదాయం 95×1.75 3.0×130/- — 21,613/-
5. మొత్తం ఆదాయం — 21,613/-
6. మొత్తం ఖర్చు — 6,000+5,000 — 11,000/-
7. నికర ఆదాయము = మొత్తం ఆదాయం - మొత్తం ఖర్చు

   = 21,163 - 11,000

   = 10,613/-
8. సంవత్సరానికి 4 బ్యాచీలు తెచ్చి, పెంచి, అమ్మగా వచ్చే ఆదాయం 10,613×4=42,452
9. ఒక్క నెలకు వచ్చే ఆదాయం = 42,452 / 12=3,538/-

## 13.2. గ్రుడ్లు పెట్టే రకం

ఉదా॥ గ్రామప్రియ

1. గ్రామీణ రైతు 100 పిల్లలు కొనడానికి అయ్యే ఖర్చు (400 గ్రా॥ బరువు గలవి 1.5 నెలల వయస్సులో అన్ని టీకాలు వేసినవి) 100×6,000=6,000 — 6,000/-
2. కొన్న 100 పిల్లలలో 10% చనిపోయినవి అనుకుంటే మిగిలేవి 100-10=90 పిల్లలు
3. ఈ 90 పిల్లలో సగం అనగా 45 మగ పిల్లలు, 45 ఆడపిల్లలు ఉన్నాయి అనుకుంటే
4. రాత్రిపూట కోళ్ళ గూడు నిర్మాణం కొరకు — 5,000/-

5. 10 వారాల తరువాత 45 మగ కోళ్ళు 1.5 కె.జి. నుండి 2 కె.జీలు (సరాసరి 1.75 కె.జి.) బరువు పెరుగుతాయి. వీటిని మాంసము కొరకు అమ్ముట వలన వచ్చే
ఆదాయం 45×1.75 3.2 × 130=10,238/- 10,238/-

6. ప్రతి ఆడకోడి ఒక సంవత్సరమునకు సరాసరి 160 గ్రుడ్లు పెడతాయి. అనుకుంటే ప్రతి గుడ్డుకు రూ॥5.00 చొప్పున అమ్మితే 45 కోళ్ళ ద్వారా 45×160×5.00=36,000/- 36,000/-

7. ఒక సంవత్సరము తరువాత 45 ఆడకోళ్ళను సరాసరి 2.5 కె.జీల బరువుతో ఉన్నప్పుడు మాంసము కొరకు అమ్మట వలన వచ్చే ఆదాయం 45×2.5 3.2×100=00=11.250/- 11,250/-

8. మొత్తం ఆదాయం = 10238 + 36000 +11250=57488/-

9. మొత్తం ఖర్చు = 6000 + 5000/- 11000/-

10. నికర ఆదాయం = మొత్తం ఆదాయం - మొత్తం ఖర్చు

= 57,488 - 11,000

= 46,488

11. 18 నెలలకు వచ్చే ఆదాయం 46,488/- అయితే ప్రతి నెలకు వచ్చే ఆదాయం 46,488/18=2,582/- ప్రతి నెలకు రూ॥ 2,582/- వచ్చును.

## 13.3. పెరటికోళ్ళ గుడ్లను నాటుకోళ్ళ ద్వారా పిల్లలను ఉత్పత్తి చేయడము

ఉదా॥ గ్రామప్రియ మరియు రాజశ్రీ

1. గ్రామీణ రైతు 1.5 నెలల వయస్సు గల 100 కోడి పిల్లలను, 400 గ్రా. బరువు గల అన్ని టీకాలు వేసినవి, ఖరీదు

100×60/- = 6,000/- 6,000/-

2. కొన్న పిల్లలో 10% చనిపోయినవి అనుకుంటే మిగిలేవి 100-9=90 పిల్లలు

3. రాత్రిపూట కోళ్ళగూడు నిర్మాణం కొరకు 5,000/-

4. 90 పిల్లలో 45 మగవి మరియు 45 ఆడవి అనుకుంటే, బ్రీడింగ్ కొరకు 5:1 అనగా 5 అడవి, 1 మగదికు ఈ 45 మగకోళ్ళలో 9 కోళ్ళను బ్రీడింగ్ అవసరాలకు ఉంచి, మిగతా 36 మగ కోళ్ళను 1.5 నుండి 2 కె.జి. (సరాసరి 1.75 కె.జి.) బరువు వచ్చి తర్వాత అమ్మగా 36×1.75 3.2 × 130/- 8,190/-

5. ఒక ఆడ కోడి సరాసరి ఒక సంవత్సరమునకు 160 గుడ్లు పెడితే 45 కోళ్ళ 7200 గుడ్లు. 45×160 = 7200. ఈ 7200 గుడ్లలలో 75% శాతం ఫలదీకరణ చెందిన గుడ్లు అనుకుంటే 5400 గుడ్లు పొదుగు వేయుటకు పనికి వచ్చును. ఈ 540 ఫలదీకరణ చెందిన గుడ్ల నుండి 70% కోడి పిల్లల జననం జరిగితే, 3780 కోడి పిల్లలు పుడుతాయి, ఒక్కో పిల్లను రూ॥ 15-00 చొప్పున అమ్మితే 3780×15/- = 56,700/- 56,700/-

6. 7200 మొత్తం గుడ్లలలో 25% ఫలదీకరణం చెందని సుమారు 1800 గుడ్లను తినడానికి (టేబుల్ ఎగ్స్) అమ్మినచో 1800×5/- = 9,000/- 9,000/-

7. పిల్లలు పుట్టిన తరువాత మొత్తం ఆడకోళ్ళను అనగా 45 మరియు 9 మగకోళ్ళను మాంసము కొరకు అమ్మగా వచ్చే ఆదాయము (ఈ 54 కోళ్ళలలో 4 కోళ్ళు మరణించినవి అనుకుంటే) 54-4=50, 50×2.5 కె.జి.×110/- = 13,750/-.

8. మొత్తం ఆదాయం 8,190+56,700+9,000+13750=87,640/-

9. మొత్తం ఖర్చు = 6000+5000 = 11,000/-

10. నికర ఆదాయం = మొత్తం ఆదాయం - మొత్తం ఖర్చు
= 87,640/- - 11,000/-
= 76,640/-

11. ఆరు నెలలు పెరుగుదల కాలం మరియు 12 నెలలు గుడ్లు పెట్టుకాలం అనుకుంటే ప్రతి నెలకు వచ్చే ఆదాయం = 76,640 / 18 = 4,257/-